ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

సోమవారం 21 జూలై 2025



పీజీ కోర్సులకు అనుమతి వచ్చేనా..!

- వైద్య కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు
- పీజీ కోర్సులకు దరఖాస్తు
- 24 సీట్ల కోసం రూ.94 లక్షలు డిపాజిట్

7



బోనాల జాతర...

- ఊరూరా సంబరాలు
- ఆషాఢం చివరి ఆదివారంతో సందడి

8

కాయకల్ప అవార్డులకు
పలు ఆసుపత్రులు ఎంపిక

- జిల్లాలో మొత్తం 66 ఆసుపత్రులు
- అవార్డుకు 24 ఆసుపత్రులు ఎంపిక

8

ఫటా ఫట్

యువత మద్యానికి
బానిసకావద్దు

● మల్లేష్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ



పెద్దపల్లిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : యువత మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని పెద్దప ల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్నారా ?

ఎస్ఐ: మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. పెట్రోలింగ్ చేసినప్పుడు యువత అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

ఎస్ఐ: దొంగతనాల నివారణకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ప్రాముఖ్యతను వివరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎస్ఐ: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మద్యం తాగి వాహ నాలు నడుపకుండా తనిఖీలు చేపడుతున్నాం.

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేసిన అధికారులకు బాధ్యతలు
- అనారోగ్యంతో బాధపడుతున్న కీలక నేతలు
- జిల్లాకు చెందిన 10మంది మావోయిస్టు నేతలు అజ్ఞాతంలో..
- కేంద్ర కమిటీలోనే ముగ్గురు నాయకులు



మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుకు చర్యలు

కోల్‌సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): అబుజ్‌మడ్ ప్రాంతాల్లో పని చేస్తున్న జిల్లాకు చెందిన మావోయిస్టు కీలకనేతలపై పోలీసులు దృష్టి పెట్టారు. వారిపై ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. దండ కారణ్యంలో కేంద్ర బలగాలు, కోబ్రా కమాండెంట్లు మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌లో ముందడుగు వేస్తున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌తో చెల్లా చెదురుగా ఉన్న మావోయిస్టు నాయకత్వాన్ని ఆ పార్టీకి దూరం చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వారిని తుద ముట్టించడంతోపాటు లొంగుబాటుకు కార్యాచరణ రూపొందించుకుంటు న్నారు. ఇప్పటికే దండ కారణ్యం, ఆంధ్రా, ఒడిశా బార్డర్, అబుజ్‌మడ్‌లో స్థానిక నాయకత్వం, క్యాడర్‌ను లొంగు బాటుకు చర్యలు చేపట్టింది. ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయక త్వంపై దృష్టి పెట్టింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన కీలక నేతలు దండకారణ్యంలో మావోయిస్టు పార్టీకి ప్రాతిని ధ్యం వహిస్తున్నారు. స్థానికులకు చెందిన క్యాడర్ లొంగుబాటు పట్టడంతో సేఫ్టీ జోన్‌లోకి నాయకత్వం వెళ్లినట్టు తెలుస్తున్నది. దీంతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయకత్వంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలా బాద్, వరంగల్ జిల్లాలకు చెందిన కీలక నాయకులు ఉన్నారు. ఇందులో ఒక పెద్దపెల్లి జిల్లాకు చెందిన నాయకులే పది మంది ఉన్నారు. ఇందులో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు కాగా మిగతా వారు తెలంగాణ రాష్ట్ర కమిటీ, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీలకు బాధ్యతలు వహిస్తున్నారు.

జిల్లాలోని మంథని మండలం శాస్త్రులపల్లికి చెందిన మల్లారాజిరెడ్డి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఇత నిపై రూ.25లక్షల రికార్డు ఉంది. పెద్దపల్లికి చెందిన మల్లోజుల వేణుగోపాల్‌రావుకు కూడా కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉండి అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తు న్నారు. వడ్కాపూర్‌కు చెందిన పుల్లూరి ప్రసాద్‌రావు స్టేట్ కమిటీ సభ్యుడిగా, తెలంగాణ రాష్ట్ర కమిటీకి సలహాదారుడిగా ఉన్నారు. ఈ ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులపై రూ.25లక్షల రివార్డు ఉంది. వీరితో పాటు సబ్బితంకు చెందిన జంగిడి సత్యనారాయణరెడ్డి, కాల్వశ్రీ రాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన కంకణాల రాజిరెడ్డి తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. రామగుండంకు చెందిన అప్పాసి నారాయణ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఇతనిపై రూ.5లక్షల రివార్డు ఉంది. పాలితంకు చెందిన ఆలేటి రామలచ్చులు దండకారణ్యంలో

(మిగతా 8వపేజీలో)

నాలుగు రాష్ట్రాలకు చెందిన పోలీసుల సమన్వయం

తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు నేతల లొంగుబాటులో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ పోలీస్ యంత్రాంగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. ఏ నాయకులు ఎక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఏమిటనే విష యంపై ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి చేసు కుంటున్నారు. అనారోగ్యకర పరిస్థితులే ఆసరాగా వారిని లొంగుబాట పట్టించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట



గర్రెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తూ వారి ఆర్థికఅభివృద్ధికి చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గర్రెపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ముగ్గులు పోసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిం చారు. పలు సీసీ రోడ్లనిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతు బీఆర్ఎస్ హయాంలో ఆచరణకు యోగ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. తాము ఇచ్చిన హామీలను ఏడాదిన్నర కాలంలోనే అమలు చేశా మన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు తక్కువ ధరకే ఇటుక ఇప్పించడానికి కలెక్టర్‌తో మాట్లాడామని, బట్టీ యజమానులతో కూడా మాట్లాడి రెండు నుంచి నాలుగు రూపా యలు తగ్గించే ఆలోచన చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 4521 మహిళా సం ఘాలకు 4 కోట్ల 94 లక్షల రూపాయల వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. త్వరలోనే మహిళా సం ఘాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు ఏడాదికి రెండు చీరల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. గర్రెపల్లి సహకారం సంఘం మాజీ చైర్మన్ కల్లెపల్లి జానీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కమాన్ నుంచి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, పన్నాల రాములు, దామోదర్‌రావు, చిలుక సతీష్, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం, సత్యనారాయణ రావు, బండారి రమేష్, మాదాసు వెంకన్న పటేల్, చక్రధర్, రాజలింగం, డీకొండ శ్రీనివాస్, జూపల్లి తిరుమల్ రావు తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన

కాల్వశ్రీరాంపూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట, మీర్జంపేట గ్రామాల రహదారిపై ఆదివారం బీజేపీ నాయకులు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి పూర్తిగా చెడిపోయి గుంతలమయంగా మారిందని వారు విమర్శించారు. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వర్షాలు పడటంతో రోడ్డు మొత్తం బురదమయంగా మారిందన్నారు. నాయకులకు పట్టింపు లేదని, అందుకే వరి నాట్లు వేసి నిరసన తెలుపుతున్నామన్నారు. ఆర్టీసీ బస్సులు రావడం లేదని, విద్యార్థులకు, గ్రామస్థులకు ఇబ్బందిగా మారిందని, ఈ రహదారి మీదుగా మంథని నుంచి జమ్మికుంటకు, వరంగల్ ప్రధాన రహదారిగా ఉందన్నారు. వెంటనే స్పందించి తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన రహదారి వేయాలని బీజేపీ నాయకులు గూడుపు జనార్దన్ రెడ్డి, రావుల రాజకుమార్ డిమాండ్ చేశారు. పంజాల సతీష్, గొర్రె ఉదయ్ కిరణ్ యాదవ్, గోపి, శ్రీకాంత్, కుర్మా, ఉయ్యాల చంద్రం గౌడ్, ఉయ్యాల నరేష్ గౌడ్, ఆళ్ల తిరుపతిరెడ్డి, ఖడ్గం సాయిచంద్, గట్టు శివరాం, కొడదల అనిల్, దేశిని నరేష్ పాల్గొన్నారు.



నాట్లు వేసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణకు అన్యాయం



బనకచర్ల ప్రాజెక్టుపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

కోల్‌సిటీటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు గోదావరి జలాలను దోపిడీ చేస్తున్న కుట్రలో భాగమని బీఆర్ ఎస్వీ కోఆర్డినేటర్ కొలుగోరి సాయికుమార్ (చింటు) అన్నారు. ఆదివారం గోదావరిఖనిలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ హాస్టల్‌లో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ గోదావరి నదిలో 200టీఎంసీల వాటాను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి నీటిని రాయలసీమకు తరలించడానికి ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన అక్రమ ప్రాజెక్టు పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ అని వివరించారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయి సహకరిస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్, శ్రీకాంత్, రాకేష్, అజయ్, శశి, హరీశ్ పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డుతో

నరకయాతన

- గుంతలమయంగా మారిన చిన్నఓదాల రహదారి
- ఆందోళన చెందుతున్న వాహనదారులు



చిన్నఓదాల-గోపాల్‌పూర్ మధ్య దెబ్బతిన్న రోడ్డు

మంథనిరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పూర్-చిన్నఓదాల ప్రధాన రహదారి ధ్వంసమైంది. రచ్చపల్లి ప్రధాన రహదారి ఆనుకొని ఉన్న గోపాల్‌పూర్-చిన్నఓదాల ప్రధాన బీటీ రహదారి 11 కిలోమీటర్ల వరకు పూర్తిగా దెబ్బతిన్నది. గోపాల్‌పూర్, చిన్నఓదాల, పెద్దఓదాల, జిల్లల్లపల్లి గ్రామాలకు వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై కంకర తేలడంతోపాటు వాహనాల రాకపోకలతో దుమ్ములేస్తోంది. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళాలంటే ముత్తారం మండలంలోని ధర్మారం, రంగయ్యపల్లి గ్రామాల మీదుగా వెళ్తున్నారు. దీంతో వీరికి దూరభారం పెరుగుతుంది. నిత్యం మంథనికి వచ్చే విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి అటవీ ప్రాంతంలో ఉండటంతో రాత్రి పూట ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. గుంతల్లో పడి పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ రహదారి గుండా నాలుగు గ్రామాల ప్రజలు పాఠశాలలకు, ఇతర ప్రాంతాలకు వెళ్ళాంటే రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. అధికారులు వెంటనే స్పందించి చిన్నఓదాల, గోపాల్‌పూర్ గ్రామాలు నూతన రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతల 'భగీరథ' యత్నం

అడుగంటిన భూగర్భ జలాలు

- పూడికతీస్తున్నా కానరాని నీరు
- సాగునీటి కోసం రైతన్నల పాట్లు

ఓదెల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభమైనా ఆశించిన వర్షాలు కురవడం లేదు. సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కూడా మండల వ్యాప్తంగా వరినాట్లు పూర్తికాలేదు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వ్యవసాయ బావుల్లో, ఊర చెరువుల్లో, కుంటల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. గతేడాది వానాకాలంలో ఇదే సమయంలో 60 శాతం నాట్లు పూర్తికాగా, ప్రస్తుతం 20 శాతం కూడా కాలేదు. దీంతో అన్నదాతలు సాగు నీటి భగీరథ యత్నాలు చేస్తున్నారు. దీంతో రైతులు అప్పులు చేసి యంత్రాలతో బావులు తవ్విస్తున్నప్పటికీ చుక్క నీరు కూడా కనబడడం లేదు. ఓదెల, పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, గుంపుల, గూడెం, ఇందుర్తి, జీలకుంట, కొమిర, మడకలో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలకు గురైనప్పటికీ యంత్రాలతో వ్యవసాయ బావులు తవ్విస్తున్నారు. లక్షల కొద్ది ఖర్చు చేసినప్పటికీ చుక్కనీరు కనబడక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

● సాగులో లేని19 వేల ఎకరాలు

మండల వ్యాప్తంగా 27వేల ఎకరాల మేరకు సాగు భూములు ఉండగా, ఇందులో ప్రస్తుతం 3,950 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అలాగే 3,800 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. మిగతా 19,250 ఎకరాల వ్యవసాయ భూములకు నీరు లేక సాగుకు నోచుకోలేదు. ప్రస్తుతం ఎగువ ప్రాంతంలోని కుంటల సమీపంలో ఉన్న బావుల్లో కొంతమేరకు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో వీటి ఆధారంగా సన్న రకం వరినాట్లు పూర్తి కావస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షం పత్తి పంటకు కొంత ఊరట నిచ్చింది. మరో కొద్ది రోజుల వరకు అనావృష్టి ఇలాగే ఉంటే సాగు చేసిన వరి పంటలకు సైతం నీరందక ఇవి కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోతుంది



పొత్కపల్లి శివారులో బావి తవ్విస్తున్న రైతు సమ్మయ్య

● వ్యవసాయ బావుల తవ్వకానికి లక్షల్లో ఖర్చు



అడుగంటిన వ్యవసాయ బావి

వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాల కోసం ఆశలతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా భూగర్భ జలాలు కనబడకపోవడంతో రైతుల ఆశలు అడియాశలవు తున్నాయి. ఒక్కో బావికి రూ.1.50 లక్షల నుంచి రూ.2.20 లక్షల మేరకు ఖర్చు చేస్తున్నారు. ఆశించిన ఫలితాలు లేకపోవడంతో పెట్టిన ఖర్చులు వృథా అయి అప్పులు మిగులుతున్నాయి. ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉన్న బావుల్లో కేవలం రెండు నుంచి ఐదు గంటలపాటు సరిపడ నీరు లభిస్తుంది. తర్వాత బావుల్లో నీటి జాడలు కనబడడం లేదు.

● బీళ్లుగా మిగులుతున్న సాగుభూములు

వర్షాభావ పరిస్థితులు ఇలాగే ఉంటే సాగు భూములు బీళ్ళుగా మిగిలిపోయే ప్రమాదం నెలకొంది. ఆశతో మృగశిర కార్తెలో నారుమళ్ళను సిద్ధం చేసుకొని వరి మొలక చల్లిన తర్వాత ఎదిగిన నారుతో వరి నాట్లు వేసే సమయం కూడా అయిపోతుంది. కొందరు రైతులు మడికట్లను దున్నుకొని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. దున్నుకొని నాటుకు సిద్ధం చేసిన భూములు కూడా ఎండిపోయాయి.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

\- ఏవో భాస్కర్, ఓదెల



నీటి సౌకర్యాలు లేకుంటే రైతులు ఆరు తడి పంటలపై దృష్టి పెట్టాలి. వరిసాగుకు నీరు ఎక్కువ అవసరం ఉంటుంది. ఆరుతడి పంటకు అతి తక్కువ నీటితో పంట పూర్తి చేసుకోవచ్చు. ఆలోచించి రైతులు ఖర్చు తగ్గించాలి. ప్రస్తుతం భూగర్భ జలాలు తక్కువ ఉండడంతో ఆరుతడి పంటలకు యోగ్యంగా ఉంటుంది.

బావి తవ్వినా నీరు రాలేదు

\- బండారి సమ్మయ్య, రైతు, పొత్కపల్లి



ఊర చెరువులో నీరు ఇంకిపోయింది. దీని ఆయకట్టు 347ఎకరాలకు ఉంటుంది. చెరువు కింద భూగర్భ జలాలు ఉంటాయనే ఆశతో రూ.1.50 లక్షల ఖర్చు చేసినా నీరు రాలేదు. దీంతో పెట్టిన ఖర్చు వృథా అయ్యింది. ఎటు చూసినా ఏమీ లేదు ఇక ప్రభుత్వమే కనికరించి ఆదుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో సైకిలిస్టు మృతి

జగిత్యాల క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో రోడ్డు ప్రమాదంలో ఆదివారం సైకిలిస్టు పోచంపెల్లి పోచరాజు(48) అనేవ్యక్తి మృతిచెందాడు. గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామానికిచెందిన పోచంపెల్లి పోచరాజు ఉపాధి కోసం జగిత్యాల పట్టణానికి వలసవచ్చి కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం పోచరాజు తనఇంటి నుంచి సైకిల్‌పై కొత్త బస్టాండ్ వైపు వెళ్తుండగా కరీంనగర్ వైపు వెళ్తున్న భారీ క్రేన్ ఢీకొని మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రదీప్ కుమార్ అనేవ్యక్తి అజాగ్రత్తగా క్రేన్‌ను నడుపుతూ పోచరాజు నడుపుతున్న సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో పోచరాజు కిందపడగా అతడి తలపై నుంచి క్రేన్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామానికిచెందిన మత్తమర్రి మొండయ్య(75) అనేవృద్ధుడు మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మొండయ్య ఆదివారం మృతిచెందాడు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుప త్రిలో పోస్ట్‌మార్టం చేశారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కొడిమ్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన చిలువేరు అశోక్(36) అనే యువకుడు కరీంనగర్‌లోని ప్రైవేటుఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. తనకు పెళ్ళి కావటం లేదని అశోక్ మనస్థాపానికి గురై ఈనెల 10న గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి నర్సింహరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


పొలం వద్ద మృతిచెందిన మహేందర్

కోనరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన అనుముల మహేందర్ (45) అనేరైతు తన పంటపొలంలో పశువుల మేతకోసం గడ్డి కోయడానికి వెళుతున్నానని భార్య మమతకు చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా కలవకపోవడంతో ఆదివారం రాత్రి పంటపొలం వద్దకు వెళ్లిచూడగా విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు గుర్తించారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మమత, కూతురు, కుమారుడు ఉన్నారు.

ఇసుక లారీల పట్టివేత

ఇబ్రహీంపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10లారీలను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్రావుపేట, సత్తక్కపల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్63 రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకున్నామన్నారు. బండలింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను పట్టుకున్నామన్నారు. మెట్‌పల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాంతయ్య ఫిర్యాదు మేరకు లారీల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు ఊడిపోయి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు ముందు టైర్ ఆదివారం ఊడిపోయింది. వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామంలోని ప్రశాంత్ తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేట వైపు నుంచి రాచర్లగొల్లపల్లికి వెళుతున్నారు. హెచ్‌పీ బంకు సమీపంలోకి చేరుకోగానే వాహనం ముందు టైర్ ఊడిపోయింది. కారు ముందు భాగం దెబ్బతింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శనివారం తెలిపారు. గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు ఈనెల 19న రాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామని పేర్కొన్నారు. తమ రాకను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయారని చెప్పారు. మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7600 నగదుతో పాటు పేకాట ముక్కలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఓబులాపూర్ గ్రామ శివారులో..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామ శివారులోని పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారినుంచి రూ.23వేల నగదును స్వాధీనం చేసుకుని, రెండు ద్విచక్ర వాహ నాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వ ధ్వంసం

జమ్మికుంట రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని 629సర్వే నంబర్‌లోగల ఎస్సారెస్పీ కాల్వను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇప్పటికే ఆ ప్రాంతంలోని ప్రభుత్వభూమి కబ్జా గురవుతోంది. మొత్తం కాల్వను ధ్వంసం చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇంత జరిగినా ఎస్సారెస్పీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


ధ్వంసం అయిన ఎస్సారెస్పీ కాల్వ

వెల్‌నెస్ సెంటర్‌లో అరకొరగా మందులు

• ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు



సుభాష్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రి ఆవరణలోని వెల్‌నెస్ సెంటర్‌లో అరకొర మందులతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయుల కోసం 2018 జూన్ 28న జిల్లా జనరల్ ఆసుపత్రిలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌కు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు వైద్యం కోసం వస్తుంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వెల్‌నెస్ సెంటర్‌లో సేవలు అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో 23 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తొమ్మిది వేలు, జర్నలిస్టులు 1500 మంది ఉన్నారు. వైద్యం కోసం వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చినవారు సంబంధిత డాక్టరుకు చూపించుకున్న తరువాత డాక్టరు రాసిన మందులు అక్కడ అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. మందులు స్థానిక మెడికల్ ఏజన్సీల నుంచి సరఫరా చేస్తున్నా, వాటిని మంజూరు చేసేది హైదరాబాద్‌లోనే. వెల్‌నెస్ సెంటర్ వారు మందులు కావాలని ఇండెంట్ పెడితే సంబంధిత అధికారి సెలవులో ఉంటే మందులు రావడం మరింత ఆలస్యం అవుతోంఅవది. బీపీ, షుగర్‌తోపాటు ఇతర వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల నొప్పులు ఇతర శారీరక నొప్పులకు సంబంధించిన ఆయింట్‌మెంట్‌కూడా అందుబాటులో లేకపోవడం శోచనీయమని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని మందులు అందుబాటులో ఉంచాలి...

-దారం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు



డాక్టర్లు రాసిన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. డయాబెటీస్ పేషంట్లకు ఇన్సులిన్, బీపీకి సంబంధించిన మందులతోపాటు, గుండెకు సంబంధించిన మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి. వెల్‌నెస్ సెంటర్‌లో స్పెషలిస్టులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుండె, నరాలకు సంబంధించిన మందులను వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉంచాలి.

● బీపీ, షుగర్ బాధితులే ఎక్కువ...

వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చేవారిలో బీపీ, షుగర్, థైరాయిడ్ బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్లు, సిబ్బంది సరిపడా ఉన్నప్పటికి మందులు మాత్రం అందుబాటులో ఉండడంలేదు. మూడు నెలలకు ఒకసారి మందులకు సంబంధించిన ఇండెంట్ పెడతారు. ఆ మందులు వచ్చేలోగా అప్పటి వరకు ఉన్న మందులు అయిపోతున్నాయి. ప్రతినెల ఎంతమంది బీపీ, షుగర్, థైరాయిడ్ పేషంట్లు వస్తు న్నారు, వారికి ఎన్ని మందులు అలవసరమనే విష యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇండెంట్ పెడుతున్నామని సిబ్బంది అంటున్నారు. అవి రావడంలో ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు చెబుతున్నారు. సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికే యులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలు

సుల్తానాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గట్టేపల్లి గ్రామానికిచెందిన వజీర్ ఆదివారం రాత్రి బైక్‌పై పెద్దపల్లి రోడ్డులో గల పెట్రోల్‌బంకువద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వజీర్ తీవ్రంగా గాయపడగా పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో మల్యాలకుచెందిన బావు చంద్రయ్యకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన కె ఆంజనేయులు మే27న తన సెల్‌ఫోన్‌ను ఆరేపల్లి దగ్గర పోగొట్టుకున్నాడు. కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీతో జగి త్యాలలోఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపిస్తున్న త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డుకాలనీ గౌతమ్ మెడికల్ షాపులో జరిగిన చోరీ కేసులో నిందితులను త్రీటౌన్ పోలీసులు అరెస్టుచేశారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ జాన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఈ నెల 16న గౌతమ్ మెడికల్ షాపులో జరిగిన చోరీలో రూ.3 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు హౌసింగ్‌బోర్డు కాలనీలో అద్దెకు ఉంటున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సబ్బీర్ ఆలం అలియాస్ అజ్మల్ హుస్సేన్ అలియాస్ సకీర్ చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. గతంలో సిద్దిపేటలో ఒక హోటల్‌లో పని చేసిన్నప్పుడు అతడికి పరిచయమైన బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ రిజ్వాన్ ఆలం, మహ్మద్ ఫర్హాన్ ఆలంను పిలిపించుకొని వారితో కలిసి దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడించాడు. వీరు గతంలో జరిగిన పలు దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు, ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై జగదీశ్వర్, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు సాయినేత్ర, ప్రశాంత్‌ను అభినందించారు.

బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగునూర్ శివారులోని కాకతీయకాలువ పక్కన ఈనెల 18న ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించిన నిందితుడైన బాలిక మేనమామను ఆదివారం పట్టుకున్నట్లు తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. బోయిన్‌పల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే బోయిన్‌పల్లిలో రౌడీషీట్ ఉందని సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ను సీఐ సదన్ కుమార్‌తోపాటు ఇతర పోలీస్ అధికారులు అభినందించారు.

ఇంటర్ చదువుకు విద్యార్థుల అవస్థలు

● మండలంలో జూనియర్ కాలేజీ లేక ఇబ్బందులు


బస్సెక్కి కాలేజీకి వెళుతున్న విద్యార్థులు

గన్నేరువరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజు కరీంనగర్‌కు 40కిలోమీటర్ల దూరం ప్రయాణించి చదువుకుంటున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ఆర్టీసీ, కాలేజీల బస్సులలో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు పక్కనున్న ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలకు వెళుతున్నారు. ఇల్లంతకుంటకు నేరుగా బస్సుసౌకర్యం లేకపోవడంతో పొత్తూరు వరకు వెళ్లి అక్కడి నుంచి మరోబస్సు ద్వారా ఇల్లంతకుంటకు వెళుతున్నారు. ప్రతిరోజు ఇలా విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీకి అనువైనస్థలం ఉంది. అక్కడ కాలేజీ ఏర్పాటు చేయాలని గతంలో నివేదికలు పంపినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడంలేదు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అప్పటి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కళాశాలల్లో డ్రగ్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించండి

● రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


ఎల్ఎండీలోని అతిథి గృహం వద్ద సీఐ సదన్‌కుమార్‌కు సూచనలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో డ్రగ్స్‌పై విద్యార్థులకు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించాలని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌ను రాష్ట్ర ఐటీశాఖమంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆదివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో నీటిపారుదలశాఖ అతిథి గృహంలో కాసేపు ఆగిన మంత్రి అక్కడే ఉన్న కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి, తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌తో మాట్లాడారు. డ్రగ్స్‌పై విద్యార్థులకు, సంబంధిత యాజమాన్యాలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు జిల్లాకు కూడా ఎన్నికలకు సంబంధించి కొంతసమయం కేటాయించాలని కాంగ్రెస్‌నాయకులు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. కార్యక్రమంలో సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

వీణవంక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికిచెందిన అన్వేష్ తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం కరీంనగర్‌కు వెళ్లి తన బావకి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేశాడు. వెంటనే అతడు తల్లిదండ్రులకు సమాచారం అందిచారు. వారు పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో ఫోన్‌నంబర్‌ను ట్రేస్‌చేసి పోలీసులు అన్వేష్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు వెంటనే స్పందించి యువకుడిని కాపడినందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎస్ఐకి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బండరాళ్లు పడి బాలుడి మృతి

బీర్‌పూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం రేకుపెల్లి గ్రామంలో ఆదివారం బండరాళ్లు పడి కడ ధనూష్(11) అనే బాలుడు మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపినవివరాల ప్రకారం కడ రాజేందర్-లక్ష్మి దంపతులు ఆదివారం తమ పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లారు. వారితో కుమారుడు ధనూష్, బంధువైన మరో బాలుడు అకీల్ వెళ్లారు. పొలం పక్కన కుప్పగా వేసి ఉన్న బండరాళ్ళపై కూర్చొని బాలురు ఆడుకుంటున్న క్రమంలో బండరాళ్ళు కదిలి జారి పడిపోయారు. దీంతో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రాజేందర్ జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ధనూష్ మృతి చెందాడు. అకీల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ధనూష్ తుంగూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. పోలీసులు విచారణ చేపడుతున్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు..

● ప్రారంభానికి నోచుకొని షాపింగ్ కాంప్లెక్స్
● దేవాదాయశాఖ ఆదాయానికి గండి


అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ భవనం

ఇల్లందకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన షాపింగ్‌కాంప్లెక్స్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. మండలకేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్‌పథకం కింద ఐదేళ్లక్రితం సీతారామచంద్రస్వామి ఆలయసమీపంలో భక్తుల సౌకర్యార్థం షాపింగ్ కాంప్లెక్స్ భవనం నిర్మాణ పనులు రూ.50లక్షలతో చేపట్టారు. భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా నిధులు లేమితో పనులు నిలిచిపోయాయి. భవన నిర్మాణం పూర్తయితే 5షాపింగ్‌గదులు, పైఅంతస్తులో భక్తుల సౌకర్యార్థం అద్దెగదులు ఇచ్చేందుకు వీలువుగా ఉంటుంది. దీంతోపాటు దేవాదాయశాఖకు ఆదాయం కూడా సమకూరుతుంది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ భవనం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి మిగిలిన భవన నిర్మాణపనులకు నిధులు కేటాయించి ఉపయోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

● ఉపయోగంలోకి తెస్తాం..
- ఇంగిలే రామారావు, ఆలయ చైర్మన్, ఇల్లందకుంట



షాపింగ్‌కాంప్లెక్స్ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తాం. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకనిధులు కేటాయించేలా కృషిచేస్తాం. అతిత్వరలో మిగిలిన పనులు పూర్తిచేసి భక్తులకు ఉపయోగపడేలా చేస్తాం.

● నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి..
- కందుల సుధాకర్, ఆలయ ఈవో, ఇల్లందకుంట



భవన నిర్మాణం నిధులు లేక ఆగిపోయింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నావంతు కృషిచేస్తాను. దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు నిధుల కేటాయింపునకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేస్తాం.

పండుటాకులపై పట్టింపేదీ?

● వృద్ధుల డే కేర్ సెంటర్‌పై పర్యవేక్షణ కరువు
● ఊడిపోయిన సీలింగ్ రేకులు
● భయాందోళనలో వృద్ధులు



వృద్ధుల డేకేర్ సెంటర్ బోర్డుపై ఊడిపోయిన అక్షరాలు


కేంద్రంలో ధ్వంసమైన సీలింగ్

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ వృద్ధుల డేకేర్ సెంటర్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిరాదరణకు గురైన వృద్ధులకు ఆశ్రయం కల్పించేలా ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ సమస్యలమయంగా మారింది. 18 మందికి నీడను అందించాల్సిన కేంద్రంలో ప్రస్తుతం ఐదుగురే ఉన్నారు. కేంద్రంలోని గోడకు వర్షపు నీటి జల్లు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. సీలింగ్ రేకులు ధ్వంసమయ్యాయి. అటువైపు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. అధికారుల పట్టింపులేనితనం వల్ల వృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఎప్పుడేం జరుగునోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వృద్ధులు వాపోతున్నారు.

● ఏఎన్ఎం పెద్ద దిక్కు

వృద్ధుల డే కేర్ సెంటర్‌ను ఆధునిక వసతులతో తీర్చిదిద్దారు. రెండేళ్ల కిందట అందుబాటులోకి వచ్చిన కేంద్రం నిరాదరణకు గురైనా ఎంతో మందిని అక్కున చేర్చుకుంది. ప్రస్తుతం కేంద్రంలో కో-ఆర్డినేటర్ మమత, ఏఎన్ఎం సుజాత, వంట మనిషితో పాటు ఒక సహాయకుడు విధులు నిర్వర్తిస్తున్నారు. కో-ఆర్డినేటర్ మమత తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోనూ బాధ్యతలను కొనసాగిస్తుండడంతో కేంద్రానికి ఏఎన్ఎం సుజాత పెద్దదిక్కుగా మారింది. వంట మనిషి ఉదయం భోజనం తయారుచేసి వెళ్లిపోతుంది. భారీ వర్షానికి భవనంలోని ఓ గోడ పైకప్పు నుంచి నీటి చుక్కలు పడుతున్నాయి. అటు వైపు వెళితే కాలు జారే ప్రమాదం నెలకొంది. సీలింగ్ రేకులు, బోర్డు ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృద్ధుల డే కేర్ సెంటర్‌పై ప్రత్యేక చొరవ చూపి మరమ్మత్తులు చేయించాలని వృద్ధులు కోరుతున్నారు.

● మరమ్మతు చేయిస్తాం..
- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

మండల కేంద్రంలోని వృద్ధుల ఆశ్రమం, డే కేర్ సెంటర్‌ను సందర్శించి సమస్యలను గుర్తిస్తాం. కోతుల వల్ల రేకులు, బోర్డుపై అక్షరాలు ధ్వంసమయ్యాయి. పైకప్పు నుంచి వర్షం నీరు రాకుండా మరమ్మతులు చేయిస్తాం. ఎల్లారెడ్డిపేట, మండేపల్లిలోని రెండు కేంద్రాల్లో మొత్తం 40 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నాం. కేంద్రంలోని వృద్ధులను వారం, పదిహేను రోజులకొకసారి రెండు కేంద్రాలకు అటుఇటు తీసుకెళుతుంటాం. ప్రస్తుతం ఎల్లారెడ్డిపేటలోని కేంద్రంలో ఐదుగురు ఆశ్రయం పొందుతున్నారు. కేంద్రంలో అన్ని వసతులు కల్పించి వృద్ధులకు ఏలోటు లేకుండా చూస్తాం.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తజనం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, కోడెమొక్కు క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతిరాజరాజేశ్వర స్వామివార లను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. పరివార దేవ తాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమ య్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఉప్పొంగుతున్న మూలవాగు



మామిడిపల్లి వద్ద పారుతున్న మూలవాగు

కోనరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూలవాగు ఉప్పొంగుతోంది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రాజెక్టు నుంచి వస్తున్న మూలవాగు నీరు ఆదివారం సాయంత్రం మామిడిపల్లి వరకు చేరుకుంది. దీంతో తహసీల్దార్ విజయలక్ష్మితో పాటు పలువురు అధికారులు మూలవాగును సందర్శించారు. కాగా, మూలవాగు పరిసర ప్రాంతాల రైతులు పూజలు నిర్వహించారు.

భారత్ విభూషణ్ పురస్కారాల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం మంథనికి చెందిన గౌతమి సాహితీ కళా సేవా సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ అధ్యక్షతన భారత్ విభూషణ్ జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానంచేశారు. ఈ సందర్భంగా శతాధిక గ్రంథప్రచురణకర్త, రచయిత వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ విభిన్న రంగాల్లో సేవలంది స్తున్నవారిని ప్రోత్సహించడంలో సంస్థ ముందంజలో ఉంటుందన్నారు. అంతకుముందు శ్రీధర్ సంపాద కత్వంలో వెలువడిన తల్లీ నీకు వందనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. చర్మవ్యాధి నిపుణురాలు, ప్రతిమ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గీతారెడ్డి, కవి పొర్ల వేణుగోపాలరావు, సామాజిక కార్యకర్త దీటి గోపాల కృష్ణయ్య (కడప), బ్యూటీషియన్ కుంచాల లావణ్య, సేంద్రీయ వ్యవసాయ పరిశోధకుడు యాదగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



భారత్ విభూషణ్ జాతీయస్థాయి పురస్కారాలు అందుకున్న రచయితలు

నిరుపయోగంగా వార సంతలు

- నిర్మించి రెండు సంవత్సరాలు గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాని వైనం
- పశువులకు, గ్రాసానికి, స్థానికుల అవసరాలకు ఉపయోగించుకుంటున్న స్థానికులు
- రూ. లక్షల నిధులు దుర్వినియోగం



మహాత్మానగర్ వారసంత

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లో నిర్మించిన వారసంతలు నిరుపయోగంగా మారాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మనగర్, నుస్తులాపూర్, రేణికుంట, నల్లగొండ, కొత్తపల్లి, మొగిళిపాలెం గ్రామాల్లో వార సంతలను నిర్మించేందుకు ప్రతిపాదించారు. వాటిలో మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో వార సంతల నిర్మాణం పూర్తయ్యాయి. నుస్తులాపూర్‌లో పనులను అర్థాంతరంగా నిలిపి వేశారు. కొత్తపల్లి, మొగిళి పాలెంలో పనులు ప్రారంభించలేదు.

- మహాత్మానగర్ గ్రామ పంచాయితీని సమీపంలో 15లక్షల నిధులతో నిర్మించిన వార సంత అధ్వాన స్థితిలో ఉంది. 2023 అక్టోబరు 4న అప్పటి ఎమ్మెల్యే వార సంతను అట్టహాసంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు ఒక్క రోజూ వారసంతలో కూరగాయాలు అమ్మలేదు. ప్రస్తుతం వార సంతలో స్థానికులు పశువులను కట్టేసుకుని పశుగ్రాసం నిల్వ ఉంచుకుంటున్నారు. గ్రామం లో కూరగాయలు రోడ్డు పక్కన విక్రయిస్తు న్నారు.

- రేణికుంటలో వార సంత నిర్మాణం పూర్తి అయినప్పటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో వారసంత ముందు కూర్చుని కూరగాయలు విక్రయించుకుంటున్నారు. నల్లగొండ గ్రామంలో నిర్మా ణం పూర్తయిన వార సంత కూడా ప్రారంభం కాలేదు.



రేణికుంటలో నిరుపయోగంగా ఉన్న వారసంత

● మానకొండూర్ మండలంలో..

మానకొండూర్: మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో నిర్మించిన వారసంత నిరుప యోగంగా మారింది. 2020-21 సంవత్సరంలో 12 లక్షలతో వారసంతను నిర్మించారు. ప్రారంభించి రెండేళ్లయినా వారసంత ఉపయోగంలోకి రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారసంతను ఉపయోగంలోకి తీసుక రావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసిన నుస్తులాపూర్‌లో వారసంత



నల్లగొండలో నిరుపయోగంగా ..

● ప్రజలకు అందుబాటులోకి తేవాలి

మహాత్మానగర్, నల్లగొండ, రేణికుంట గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంతలను తక్షణమే అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మహత్మానగర్ వార సంతను ప్రజలకు అనువైన స్థలంలో నిర్మించలేదని, రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వార సంత నిర్మించి ఉంటే ఇటు స్థానికంగా ఉంటే మత్యకారులకు, కూరగాయల విక్రయదారులకు ఉపయోగకరంగా ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వారసంతలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని పాదయాత్ర



మల్లాపూర్‌లో పాదయాత్రలో పాల్గొన్న పసుపుబోర్డు చైర్మన్ గంగారెడ్డి, బీజేపీ నాయకులు

మల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రం నుంచి ముత్యంపేట వరకు బీజేపీ ఆధ్వర్యంలో రైతులు పాద యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన నిజామాబాద్ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి ముఖం చాటేశారని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి కమిటీ వేశామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం నేటికీ హామీలు అమలుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలు సాగు చేద్దామంటే నీరు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు. అనంతరం బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, రైతులు మల్లాపూర్ నుంచి కుస్తాపూర్, సిర్పూర్, రాఘవపేట, హుస్సేన్‌నగర్, ముత్యంపేట గ్రామాల మీదుగా షుగర్ ఫ్యాక్టరీకి పాదయాత్రగా వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, చెట్నేని రఘు, ప్రశాంత్, సాయిరామ్, రమణ చారి, మల్లారెడ్డి, రాకేష్, సందీప్, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆగమైన ఉద్యోగుల బతుకులు

సుభాష్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగుల బతుకులు ఆగమయ్యాయని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంప్లాయిస్ జేఏసీ జిల్లాచైర్మన్, టీఎన్‌జీవోస్ ఫంక్షన్‌హాలులో వ్యవసాయశాఖ మినిస్ట్రియల్ స్టాఫ్ అసోసియేషన్ (టీఏఎంఎస్ఏ) ఉమ్మడిజిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖలో ఉన్న క్యాడర్‌స్ట్రెంత్, విభాగసమస్యలు, ఉద్యోగుల సమస్యలు, సంఘానికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. అధికారులతో చర్చలు జరిపి పరిష్కరించేందుకు కృషిచేయాలని సంఘం నిర్ణయించింది. అనంతరం దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరుతో 33జిల్లాలుగా విభజన చేసి ఆర్డర్ టు సర్వీస్ పేరిట అర్ధరాత్రి వాట్సాప్‌లలో ఆర్డర్లు ఇస్తే వాటి ఆధారంగా జిల్లాలను ప్రారంభించినట్లు చెప్పారు. కొత్తజిల్లాలను ఏర్పాటు చేశారు కానీ క్యాడర్ స్ట్రెంత్‌ను పెంచలేదని, అశాస్త్రీయంగా జోన్లను విభజించి స్థానికతను పరిగణలోకి తీసుకోకుండా ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీనెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నారని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ, హెల్త్‌కార్డుల విషయంలో సరైన నిర్ణయం తీసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులు వేరు కాదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ సంక్షేమపథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి సమర్థంతంగా అమలు చేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు. అలాంటి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీల పేరిట కాలయాపన చేయకుండా సత్వరమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ మినిస్ట్రీయల్ ఉద్యోగుల కేంద్రసంఘం అధ్యక్షుడు శ్రీహరి, సెక్రెటరీ అరుణ్‌కుమార్, టీఎన్‌జీఓఎస్ జిల్లాసెక్రెటరీ సంగం లక్ష్మణ్ రావు, టాంసా జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, సెక్రెటరీ లవకుమార్, ఒంటెల రవీందర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

కనీస వేతనాలను అమలు చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్

గంభీరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్ స్కావెం జర్స్‌కు కనీసవేతనాలను అమలు చేయా లని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీటూపీజీ హైస్కూల్‌లో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ స్వీపర్, స్కావెంజర్స్‌కు 15వేలు కనీస వేతనాన్ని అమలు చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ జీతాలు రావడం లేదన్నారు. పాఠశాలలను శుభ్రపరుస్తున్నా వారి శ్రమను గుర్తించడం లేదని, ఇప్పటికైనా నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆదర్శ కమిటీలు రద్దు చేయాలని, కార్మికులుగా గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాల యూనిఫాం అమలు చేయాలని, 65ఏళ్లు నిండిన వారందరికి 9వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, దేవయ్య, మల్లేశం, మహేష్, లత, లావణ్య రజిత, సునిత, అనిత తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా పంచాయతీ కాంప్లెక్స్ భవన సముదాయం

రామడుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ దుకాణ సముదాయ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. బస్టాండ్‌లోనే భవనం ఉన్నా అద్దెకు ఉండడానికి వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు మూడుసార్లు అద్దెకు వేలం వేశారు. ఎవరూ ముందుకు రాలేదు. సముదాయంలో ప్రస్తుతం షాపునకు 3వేల రూపాయల అద్దెపెట్టడంతోపాటు ఒకేసంవత్సరం గడువు విధించడంతో వ్యాపారులు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తున్నది. అక్కడ ఏదైనా వ్యాపారం ప్రారంభిస్తే సంవత్సరం లోపు లాభాలు ఆర్జించే సమయంలో మరోసారి టెండర్లు వేస్తే తమకు తిరిగి వస్తుందో రాదోనని అనుమానంతో ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు వ్యాపారుల అభిప్రాయం తెలుసుకుని టెండర్లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న దుకాణ సముదాయం

దేశవ్యాప్తంగా 5 కోట్ల కేసులు పెండింగ్

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 5కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్‌ఫౌండర్, చైర్మన్ భగవాన్జిరేయన్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని కృషి భవన్‌లో ఫోరమ్ ఫర్ ఫాస్ట్ జస్టిస్ ఆధ్వర్యంలో కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లాల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ముంబాయికి చెందిన ఫోరమ్‌ఫర్‌ఫాస్ట్‌జస్టిస్ ఫౌండర్ చైర్మన్ భగవాన్జిరేయన్, కన్వీనర్ ప్రవీణ్‌పటేల్ మాట్లాడుతూ తెలంగాణలో 11లక్షల పైచిలుకు కేసులు ఉండగా కరీంనగర్ జిల్లాకు సంబంధించి 38,600కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు తీసుకునేచర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లాన్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీని వాస్‌రావు, మంచిర్యాల జిల్లా న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు జగన్, సుల్తానాబాద్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు అనుమతి వచ్చేనా..!

- వైద్య కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు
- పీజీ కోర్సులకు దరఖాస్తు
- 24 సీట్ల కోసం రూ.94 లక్షలు డిపాజిట్

కళ్యాణ్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పీజీ కోర్సుల కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు అనుమతులు రావడం లేదు. కళాశాల ప్రారంభమై నాలుగేళ్లవుతున్నా పీజీ కోర్సులు ఏర్పాటు చేయడంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలను చేపట్టలేదు. సింగరేణి మెడికల్ కళాశాలకు అనుబంధంగా 365 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికీ ఆసుపత్రితోపాటు మరో 345పడకల ఐదు అంతస్థుల భవన నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నది. ఈ ఏడాది చివరికల్లా భవనాన్ని ప్రారంభించాలని, అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆరు విభాగాల్లో పీజీ కోర్సులను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితం కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు దరఖాస్తు చేశారు. సిమ్స్ కళాశాలలో పీజీ సీట్లను కేటాయించడానికి జాతీయ వైద్య విద్య కమిషన్ అంగీకరించినప్పటికీ దీనిపై స్పష్టత రాలేదు. ఆరువిభాగాల్లో 24సీట్ల కోసం ప్రభుత్వం రూ.94లక్షలు కలెక్టర్ డిపాజిట్‌ను కూడా చేసి నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు పంపారు. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కూడా సిమ్స్‌కు 24సీట్లు కేటాయించాలని నివేదికను కూడా పంపారు.

● ఆరు పీజీ కోర్సులకు దరఖాస్తు

ఈ ఏడాది సిమ్స్ మెడికల్ కళాశాలలో 4వ సంవత్సరం క్లాసులు అక్టోబరులో ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు 4వ సంవత్సరం పూర్తి చేసిన తరువాత పీజీ సీట్ల కోసం పోటీ పడతారు. ప్రభుత్వ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో సీటు వస్తే సుమారు కోటి రూపాయల వరకు ఆదా అవుతుంది. ఎమర్జెన్సీ మెడిసిన్ 4సీట్లు, ఆర్థో 4సీట్లు, గైనకాలజీ 4సీట్లు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ 4సీట్లు, పిడియాట్రిక్ 4సీట్లు మొత్తం 24సీట్ల కోసం దరఖాస్తు చేశారు. మొదటి సంవత్సరం 24సీట్లు మంజూరైతే ఇక్కడ వైద్య విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. సిమ్స్ మెడికల్ కళాశాలలో ఇప్పటికే 15శాతం ఆల్ ఇండియా కోటా సీట్లతో ఇతర రాష్ట్ర విద్యార్థులు ఈ కళాశాలలో చేరేందుకు పోటీ పడుతున్నారు.



సిమ్స్ మెడికల్ కళాశాల ముఖ ద్వారం

● సింగరేణి నిధులతో సిమ్స్ కళాశాల ఏర్పాటు

సింగరేణి రూ.520కోట్లతో సిమ్స్ మెడికల్ కళాశాలకు కేటాయించింది. ఈ కళాశాల 2022-23లో ప్రారంభం కాగా 150సీట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 15శాతం ఆల్ ఇండియా కోటాకు గాను మిగతా 7శాతం సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించగా, మిగతా 78శాతం రాష్ట్ర కోటాకు కేటాయించింది. అన్నీ వసతులు సింగరేణి మెడికల్ కళాశాలలో చేరడానికి విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

● పీజీ కళాశాలను పెద్దపల్లిలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు...

కొత్తగా ప్రభుత్వం 15పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుండగా పెద్దపల్లిలో వంద పడకల ఆసుపత్రి మాత్రమే ఉన్నది. రామగుండంలో ఏర్పాటు చేస్తే ఇటు వైద్య విద్యార్థులతోపాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా ఉపయోగం ఉంటుంది. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు 1500 నుంచి 1800మంది రోగులు వైద్య చికిత్సల కోసం వస్తుండడంతో పాటు ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దీనికి తోడు కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ పీజీ కోర్సులు వస్తే యేటా 25నుంచి 30సీట్లు పెరిగే అవకాశం ఉంది.

ఆగస్టులో అనుమతులు వచ్చే అవకాశం...

- ప్రిన్సిపాల్ హిమబిందు



సిమ్స్ కళాశాలలో పీజీ సీట్ల కోసం రూ.94లక్షలు డిపాజిట్ చేశాం. ఆగస్టులో అనుమతులు లభిస్తాయనే ఆశిస్తున్నాం. గత ఏడాదిలోనే రావాల్సి ఉంది. ఆర్థో, ఎమర్జెన్సీ మెడిసిన్, గైనకాలజీ, పిడియాట్రిక్, జనరల్ సర్జన్ విభాగాలకు దరఖాస్తు చేశాం. ఈ ఏడాది 4వ సంవత్సరం అడ్మిషన్లు కూడా ప్రారంభం కానున్నాయి. సిమ్స్‌లో 600మంది విద్యార్థులు ఈ ఏడాదితో విద్యను అభ్యసించనున్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు

● పట్టించుకోని అధికారులు

ఇల్లందకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిలువ నీడ లేక పాట్లు పడుతున్నారు. బస్సులకోసం గంటల తరబడి రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నారు. ఇల్లందకుంట మండలంగా ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. సీతారామచంద్ర స్వామిదర్శనానికి వరంగల్, భూపాలపల్లి, సింగరేణి ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఇక్కడికి వస్తారు. వారు తిరుగు ప్రయాణం చేసే సమయంలో బస్సులకోసం గంటలతరబడి ఎండలోనే రోడ్డుపై నిలబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండకూ ఎండుతూ వానకు తడుస్తూ బస్సులు వచ్చేవరకు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తుంది. బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజాప్రతినిధులు మారుతున్నా మండల కేంద్రంలో బస్‌షెల్టర్ కల నెరవేరడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.



ఇల్లందకుంటలో బస్ షెల్టర్ లేక చెట్ల కింద ఉన్న ప్రయాణికులు

● ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

- కందాల కొంరెల్లి, ఇల్లందకుంట



మండల కేంద్రానికి వివిధ పనుల కోసం ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల చెట్ల కింద రోడ్డుపైన బస్‌కోసం నిలబడాల్సి వస్తోంది. అధికారులు వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలి.

రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం రాంపల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాల్లో కోటి రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేసి ముగ్గులు పోసి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాంపల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాల్లో కోటి రూపాయల నిధులు వెచ్చించి సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణాలు చేపట్టామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు అన్ని రకాలుగా అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ఎంపీవో ఫయాజ్, కార్యదర్శులు సోనియా, రవి, శ్రీకాంత్, సింగిల్ విండో చైర్మన్ మాదిరెడ్డి నరసింహరెడ్డి, బండారు రాంమూర్తి, నూగిళ్ల మల్లయ్య, మహేందర్, పాల్గొన్నారు.

నేడు ఓదెలలో ఎమ్మెల్యే పర్యటన

ఓదెల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సోమవారం పర్యటించనున్నారు. ఓదెల మండల కేంద్రంలో నీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన, పెద్దకొమిర, భీమరపల్లి, జీలకుంట, మడక, నాంసానిపల్లి, లంబాడితండా, అబ్బిడిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు

సుల్తానాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986-87 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నర్సయ్యపల్లి విజయ ఫోటో ఫామ్ గార్డెన్‌లో జరిగిన సమ్మేళనంలో 38 ఏళ్ల విరామం అనంతరం ఒక్కచోట చేరిన మిత్ర బృందం తమ తోటి మిత్రులతో కలసి ఉల్లాసంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వారి వృత్తి ఉద్యోగ వ్యాపార విషయాల గురించి వివరించుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

కాయకల్ప అవార్డులకు పలు ఆసుపత్రులు ఎంపిక

- జిల్లాలో మొత్తం 66 ఆసుపత్రులు
- అవార్డుకు 24 ఆసుపత్రులు ఎంపిక



సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి

సుల్తానాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాతీయ హెల్త్ మిషన్ వారు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలను కాయకల్ప కింద ఎంపిక చేయగా అందులో సుల్తానాబాద్, గర్రెపల్లి ఆసుపత్రులకు చోటు లభించింది. యేటా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా ఆసుపత్రుల నిర్వహణ, పేషంట్లకు అందిస్తున్న సేవలు తదితర అంశాల గురించి కాయకల్ప అవార్డులకు ప్రశ్నావళిని నిర్వహిస్తూ ఆసుపత్రులను కాయకల్ప కమిటీ బృందం ఎంపిక చేస్తుంది. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖతోపాటు వైద్య ఆరోగ్య బృందాలు తనిఖీలు నిర్వహిస్తారు. వారి నివేదికల ఆధారంగా, ఆయా ఆసుపత్రుల్లో పలు అంశాలను పరిగణలోకి తీసుకుని కాయకల్ప అవార్డులకు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ఆసుపత్రుల జాబితాను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రసన్న కుమారిని ఆదివారం వివరాలు వెల్లడించారు. కాయకల్ప అవార్డులకు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రితోపాటు పీహెచ్‌సీ విభాగంలో గర్రెపల్లి ఎంపికైందన్నారు. సుల్తానాబాద్ ఆస్పత్రికి లక్ష, గర్రెపల్లి పీహెచ్‌సీకి యాభై వేల ప్రోత్సాహక బహుమతి ప్రకటించారు. జిల్లాలో 66 ప్రభుత్వ ఆసుపత్రులుండగా, వీటిలో 24 ఆస్పత్రులు అవార్డులకు ఎంపికయ్యాయి. మండలంలోని కనుకుల, ఐతరాజుపల్లి పీహెచ్‌సీలు రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యాయని పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్ కుమార్ తెలిపారు,

జిల్లాలో ఎంపికైన ఆసుపత్రులు ఇవే...

పీహెచ్‌సీల విభాగంలో కొలనూరు పీహెచ్‌సీకి బెస్ట్ అవార్డు ప్రకటిస్తూ రెండు లక్షల బహుమతిని ప్రకటించారు. పుట్నూరు, గద్దలపల్లి, ఓదెల, కమాన్‌పూర్, గర్రెపల్లి, రామగుండం, కూనారం, బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసి ఒక్కో దానికి రూ.50 వేలు బహుమతులు ప్రకటించారు. యుపిహెచ్‌సి విభాగంలో జనగామ యూపీహెచ్ఎస్సిని బెస్ట్ పీహెచ్‌సీగా ఎంపిక చేసి రెండు లక్షల బహుమతిని ప్రకటించారు. అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు కూడా కాయకల్ప అవార్డులకు ఎంపిక చేశారు గుండ్లపల్లిలోని ఏఏఎమ్ సెంటర్‌ను బెస్ట్ హెల్త్‌అండ్ వెల్త్ సెంటర్‌గా గుర్తించి లక్ష రూపాయల బహుమతిని ప్రకటించారు. అలాగే పత్తిపాక సెంటర్‌కు రూ.50 వేలు, ముస్త్యాల సెంటర్‌కు రూ.35 వేలు, అలాగే ఖమ్మంపెల్లి, శ్రీరాంపూర్, కనగర్తి, జూలపల్లి, మూలసాల, పెద్దకలువల, అడవిశ్రీరాంపూర్ సెంటర్లకు రూ.25 వేలు చొప్పున బహుమతులు ప్రకటించారు.

అందరి కృషితో అవార్డులు
- డీఎంహెచ్‌వో ప్రసన్నకుమారి



ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బంది సహకారంతో 24 ఆసుపత్రులు జాతీయస్థాయి కాయకల్ప అవార్డులకు ఎంపికయ్యాయి. ఆయా ఆసుపత్రులకు ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహక బహుమతులను కూడా ఆయా ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగు పర్చడానికి ఖర్చు చేస్తాం. అవార్డులు రావడానికి కారకులుగా గుర్తించిన ఆసుపత్రుల స్టాఫ్‌కు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తాం. మినిమమ్ స్టాండర్డ్స్ ప్రకారం ఆసుపత్రుల్లో సేవలందించే వాటిని గుర్తించి కేంద్రం అవార్డులకు ఎంపిక చేస్తుంది.

సుల్తానాబాద్‌కు నాలుగు సార్లు అవార్డులు
సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి



సుల్తానాబాద్ ముప్పై పడకల ఆసుపత్రికి ఇప్పటి వరకు మూడు సార్లు కాయకల్ప అవార్డులు వచ్చాయి. ఈ సారి కమాండేషన్ అవార్డు ప్రకటించారు. గతంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ రాగా,మూడు సార్లు కమాండేషన్ అవార్డులు వచ్చాయి. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం.

మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుకు చర్యలు

(5వ పేజీ తరువాయి)

స్పెషల్ జోనల్ కమిటీలో కార్యదర్శి హోదాలో పని చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన దాతు ఐలయ్య ఏరియా కమిటీ బాధ్యుడిగా పని చేస్తున్నారు. జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లికి చెందిన ఢీకొండ శంకరయ్య కమాండర్ స్థాయిలో పని చేస్తుండగా, సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్‌రావు ఏరియా కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నాడు. రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారు దండకారణ్యంలోనే ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఒక వైపు కేంద్ర బలగాలు దండకారణ్యంలో మావోయిస్టు నేతలను అష్టదిగ్బంధం చేస్తుండగా మరో వైపు తెలంగాణ పోలీసులు వారిని లొంగుబాట పట్టేందుకు తమ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. దీనిలో భాగంగా మావోయిస్టు ప్రభావిత ఠాణాల్లో పని చేసిన అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా మంథని తూర్పు డివిజన్, మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, ములుగు ఏరియాల్లో పని చేసిన పోలీస్ అధికారులకు సూచించినట్లు తెలుస్తున్నది. మావోయిస్టుల బంధువులు, స్నేహితులతో పోలీసులు టచ్‌లోకి వెళుతున్నారు.

దంపతుల లొంగుబాటులో పోలీసుల వ్యూహం

మావోయిస్టుల నేతల లొంగుబాటుకు సంబంధించి కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీ నుంచి బయటకు వచ్చే వారికి చికిత్స, పునరావాసం, ఉపాధి, రివార్డులు ఇవ్వడం, కేసుల పరిష్కారం వంటి హామీలు ఇస్తున్నారు. దీనిలో భాగంగానే ఉమ్మడి మంచిర్యాల జిల్లాకు చెందిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు ఆత్రం లచ్చన్న, అతని భార్య చౌదరి అంకుబాయిలు లొంగిపోయారు. మంచిర్యాల జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు ఇందులో కీలకంగా పనిచేశారు. వీరి లొంగుబాటులో దండకారణ్యంలో మావోయిస్టు నాయకత్వం పరిస్థితిపై పోలీసులు ఒక అంచనాకు వస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు ప్రభావిత ప్రాంత్రాలకు చెందిన క్యాడర్, నాయకులు లొంగుబాటుతో అక్కడ పని చేస్తున్నా ఇతర ప్రాంతాలకు చెందిన నాయకత్వం ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ఇతర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితులు ఉండడం, కనీసం అనారోగ్యంతో బాధపడుతున్న వారు చికిత్స చేసుకునే పరిస్థితులు కూడా లేనట్టు తెలుస్తున్నది. ఆత్రం లచ్చన్నపై కూడా పోలీసులు ఇదే విధానాన్ని అవలంభించినట్టు సమాచారం. అనారోగ్యంతో బాధపడుతున్న దంపతులు బయటకు వెళ్లాలనే పరిస్థితులు కల్పించినట్టు చర్చ జరుగుతుంది. పోలీసులకు లొంగిపోయిన లచ్చన్న దంపతులకు పోలీసులు అదే రోజు రూ.25లక్షల రివార్డు ఇచ్చారు. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లుతోపాటు ఉపాధికి సహకారం అందించేలా చర్యలు చేపడుతున్నారు. అజ్ఞాతం వీడిన లచ్చన దంపతుల నుంచి పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టుకున్నట్టు తెలుస్తున్నది.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సీఎం


క్రీడాకారులను సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ

ఎలిగేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తున్నారని మాజీ వైస్‌ఎంపీపీ బుర్ర వీరస్వామి గౌడ్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ చదరంగం దినోత్సవ సందర్భంగా ఎలిగేడు గ్రామానికి చెందిన ఎస్‌జీఎఫ్ నేషనల్ చదరంగం క్రీడాకారుడు తాటిపల్లి విశాల్, అండర్-13 క్రీడాకారుడు కేశెట్టి రిషి రాజ్‌ను సన్మానించారు. చదరంగంతో మేధాశక్తి, ఏకాగ్రత అలవడుతుందని, జీవితంలో ఎంచుకున్న గమ్యాన్ని సులువుగా చేరుకుంటారని అన్నారు. ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు కేశెట్టి రాఘవేంద్ర, మాజీ వార్డు సభ్యుడు తాటిపల్లి సతీష్ బాబు, కవ్వంపల్లి శ్రీనివాస్, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు ఐట్ల శ్రీనివాస్, కిక్కుర్ల చందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల దుమ్ముతో బడి పిల్లలకు అనారోగ్యం

కాల్వశ్రీరాంపూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): సిమెంట్ ఇటుక బట్టీల దుమ్ముతో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ ఆరోపించారు. పాఠశాలకు చుట్టుపక్కల ఉన్న సిమెంట్ ఇటుక బట్టీలతో దుమ్ము తరగతి గదుల్లో పడుతున్నదని, దీంతో పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. ఈ విషయమై గతంలో కాలనీవాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇక్కడ నిరుపేద ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్నారని, జిల్లా అధికా రులు వాటిని తరలించాలని కోరారు. హుస్సేన్‌మియా వాగు నుంచి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నా రని, మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం


మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ)నేషనల్ కౌన్సిల్ సభ్యుడు శేఖర్

రామగిరి, జూలై 20(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేషనల్ కౌన్సిల్ సభ్యుడు నగునూరి శేఖర్ అన్నారు. ఆదివారం సెంటినరీకాలనీలోని సాయిరాంగార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు మల్లోజు వంశీ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. టోల్‌గేట్ వద్ద పాత్రికేయుల వాహనాలకు రుసుము లేకుండా పంపించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాత్రికేయుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వా లన్నారు. ఆర్టీసీ బస్సుల్లో అక్రిడిటేషన్ జర్నలిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేసేలా జీవోను తేవాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లోజుల వంశీని సీఎస్ఎఫ్ ఫోరం, పాత్రికేయులు సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రసంపత్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోల లచ్చన్న, జిల్లా కోశాధికారి తగరం రాజు, జిల్లా కార్యదర్శి జబ్బర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఊరూరా బోనాల జాతర



సుల్తానాబాద్‌లో పోచమ్మ బోనాల వేడుకలు, గోదావరిఖనిలో బోనాలతో పోచమ్మ గుడికి వెళుతున్న మహిళలు

పెద్దపల్లి కల్చరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ముత్యాల పోచమ్మ వాడ భక్తులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. యేటా ఆషాఢ మాసం చివరి ఆదివారం బోనాలు సమర్పిస్తారు. మహిళలు పెద్ద డప్పుచప్పుళ్లతో అమ్మవారి ఆలయానికి వెళ్లి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో గౌడ కులస్తులు పోచమ్మ తల్లి బోనాలను నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. అనంతరం ఎల్లమ్మ గుడికి చేరుకుని నైవేద్యాలను సమర్పించారు. బైండ్ల వారి విన్యాసాలు, మహిళల పోచమ్మ ఎల్లమ్మ తల్లుల పూనకాలు నిర్వహించారు. ఉత్సవాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత, గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం తిరుపతి, అంజయ్య గౌడ్, అంతటి లచ్చయ్య గౌడ్, కొయ్యడ శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, రమేష్, శ్రీనివాస్, సంతోష్, బత్తిని కృష్ణ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. చౌరస్తాలోని పోచమ్మ ఆలయం, ఐబీ కాలనీ, విఠల్‌నగర్, తిలక్‌నగర్, బాపూజీనగర్‌లలోని పోచమ్మ ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. పోచమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించి బెల్లం, కల్లుశాకంతో మొక్కులు సమర్పించారు. పలు కాలనీల్లో మైసమ్మకు ప్రత్యేక పూజలను చేశారు. పలు కాలనీల్లో మేకలను, కోళ్లను బలి ఇచ్చారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్, రామయ్యపల్లి, శ్రీనగర్ కాలనీ, సాయిరాం కాలనీకి చెందిన మహిళలు బోనాలు ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోచమ్మ ఆలయం వద్ద అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

మేడిపల్లిలో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ జరిగింది. పోచమ్మ తల్లికి, రజకుల కుల దైవం మడేలేశ్వర స్వామికి మహిళలు బోనాలను సమర్పించారు. రజక సేవా సంఘం అధ్యక్షుడు పూసాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి మల్లేశ్, ఈదునూరి మల్లేశ్, పొటాల మల్లేశ్, అభిషేక్, శ్రీనివాస్, భూమయ్య, గోపాల్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, : కాలనీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవంలో భాగంగా హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి కాలనీ పురవీధుల గుండా బోనాల జాతర కొనసాగింది. బోనాలతో మహిళలు రాగా భక్తిశ్రద్ధలతో కోలాటం భజనలతో మహిళలు పాల్గొన్నారు.


పెద్దపల్లిలో బోనాలతో బయలు దేరిన మహిళలు

షిర్కే పోచమ్మ ఆలయంలో దేవతకు బోనం సమర్పించారు. నాయకులు దాసరి శ్రీనివాస్, రాంచందర్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

వర్షాలు కురియాలని గ్రామ దేవతలకు పూజలు

మంథనిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామంలో వర్షాలు కురియాలని మహిళలు ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలు, బిందెలతో ఆలయాలకు చేరుకొన్నారు. పెద్దపోచమ్మతల్లి, మధున పోచమ్మతల్లి, బొడ్రాయి గ్రామ దేవతలకు అభిషేకాలు నిర్వహించారు. బోనాలతో నైవేద్యాలు సమర్పించారు.


మంథనిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ ఎన్నిక

కృష్ణకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. భూపాలపల్లిలోని సింగరేణి ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల నుంచి సుమారు 200 మంది పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గోళ్ల రమేష్ (డిప్యూటీ జనరల్ మేనేజర్-కొత్తగూడెం ఏరియా), ప్రధాన కార్యదర్శిగా భూక్య కృష్ణమూర్తి (ఫిట్టర్-భూపాలపల్లి ఏరియా) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా భూపాలపల్లి ఏరియా లైజన్ ఆఫీసర్ కల్లీ రమేష్ వ్యవహరించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాయి పవన్ (కొత్తగూడెం ఏరియా), సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వాంకుడోతు శివ, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా బొర్రా రాంబాబు (భూపాలపల్లి ఏరియా), ఉపాధ్యక్షులుగా ఇస్లావత్ దిలీప్‌కుమార్ (శ్రీరాంపూర్ ఏరియా), అంబి రాజు (ఆర్జీ1 ఏరియా), బాలు నాయక్ (కొత్తగూడెం ఏరియా), కరుణాకర్ (భూపాలపల్లి ఏరియా), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నాగేశ్వర్ నాయక్ (మణుగూరు ఏరియా), బి.భీమా (ఆర్జీ1 ఏరియా), బానోత్ తిరుపతి (మందమర్రి ఏరియా), జాయింట్ సెక్రటరీలుగా ఇరుప కృష్ణ (కొత్తగూడెం ఏరియా), బానోత్ చంద్రశేఖర్ (ఆర్జీ2 ఏరియా), కిరణ్ (ఆర్జీ 1 ఏరియా), జి.ప్రేమ్‌లాల్ (మందమర్రి ఏరియా), ట్రెజరీగా ప్రశాంత్, జాయింట్ సెక్రటరీగా ఎ. చంద్రయ్య (భూపాలపల్లి) ఏరియా ఎన్నికయ్యారు.

వానకు తడుస్తూ... ఎండకు ఎండుతూ...

ఖనిలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు


యాచకుల ఆవాసంగా మారిన బస్ షెల్టర్, చెట్టు కింద బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

కళ్యాణ్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ డిపో పరిధిలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానకు తడుస్తూ, ఎండకు ఎండుతున్నా అధికారులు బస్ షెల్టర్లను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాజేష్ థియేటర్ వద్ద ప్రయాణికులు చెట్ల కిందనే బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ప్రధాన చౌరస్తాలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఫైవింక్లయిన్ చౌరస్తాలో ఉన్న బస్‌షెల్టర్ యాచకులకు ఆవాసంగా మారింది. వర్షం వస్తే తడవడం, ఎండలోనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటీవల చౌరస్తాలో ఓ స్వచ్ఛంద సంస్థ తాత్కాలికంగా తడకలతో బస్ షెల్టర్ ఏర్పాటు చేసినప్పటికీ వర్షం వస్తే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ బస్ షెల్టర్లు కానరావడం లేదు. ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయా ణికులు కోరుతున్నారు.

గుట్కా అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులు, గుట్కా అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుని ఆహార భద్రత చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఆదివారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం పొగాకు, గుట్కా లాంటి మత్తు పదార్థాలు నిషేధించినప్పటికీ కొందరు వ్యాపారులు యథేచ్ఛగా అమ్ముతున్నారని, పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. నవీన్, సుధీర్, నాగరాజు, పాల్గొన్నారు.

నేత్రదానం గొప్పది

కళ్యాణ్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నేత్రదానం గొప్పదని సింగరేణి జీఎం(క్వాలిటీ) బైద్య అన్నారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో ప్రాజెక్టు ఆఫీసర్ బింగి మాధవరావు తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆమె నేత్రాలను దానం చేశారు. ఆదివారం జవహర్‌నగర్‌లో వారి నివాసంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర దాత సంస్మరణ సభను నిర్వహించారు. అపోహలు వీడి మరణానంతరం నేత్రాలు, అవయవాలు దానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లింగమూర్తి, కేఎస్ వాసు, నూక రమేష్, దీటి వెంకటస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

సుల్తానాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరావుపల్లె బుడిగెజంగాల కాలనీకి చెందిన మోటం సంపత్ ఆదివారం మృతి చెందారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి అంత్యక్రియల కోసం మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్ ఐదు వేల రూపాయలను అందించారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని/మంథనిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ నగర్‌కు చెందిన మిర్యాల సాగర్, ఐలి గణేష్‌లు రోడ్డు ప్రమాదంలో గాయపడగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో దొమ్మటి కిషన్‌గౌడ్, నాగారంలో గడ్డం మల్లమ్మ, గడ్డం బూదమ్మలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కాపు అనిల్, దేవేందర్‌లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

మంథనిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపల్లి గ్రామంలో మేడి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి ఆదివారం శ్రీగంగాదేవీ నిత్యాధీపారదన కమిటీ సభ్యులు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వారు తెలిపారు.

ఈనెల 23న మ్యారేజీ బ్యూరోల సమావేశం

మంథని, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సమీపంలోని ఎల్లమ్మగుడి ఆవరణలో ఈనెల 23న మ్యారేజీ బ్యూరోల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మన తెలంగాణ మ్యారేజీ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పడితం భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.

సన్నాహక సదస్సును విజయవంతం చేయాలి

ఎలిగేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మంద కృష్ణ మాదిగ సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బాసంపల్లి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. ఈ నెల 25న నిర్వహించే సదస్సుకు వికలాంగులు, వృద్ధులు, వితంతువు, ఒంటరి మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. బాపయ్య, న్యాతరి పోచయ్య, రాజేష్, వినోద్, పాల్గొన్నారు

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ముక్కెర శ్రీనివాస్ గౌడ్

పాలకుర్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య, మండల ఎన్నికల ఇన్‌చార్జి గట్ల రమేష్, దీటి బాలరాజ్, పాతిపెల్లి ఎల్లయ్య, నాయకులు శ్రీనివాస్ యాదవ్, పాత రవీందర్, పాల్గొన్నారు.